పట్టభద్రులు బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలి

- ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్పీ
- నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఏమైంది?: పల్లా

హనుమకొండ జిల్లా దామెరలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి. చిత్రంలో ఆర్ఎస్పీ, సుధీర్‌కుమార్, చల్లా ధర్మారెడ్డి, రాకేశ్‌రెడ్డి

దామెర, మే 18: వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని పట్టభద్రులు ఆశీర్వదించి, భారీ మెజార్టీతో గెలిపించాలని నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలోని ఏఎన్ఆర్ గార్డెన్స్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలపై పరకాల నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హాజరయ్యారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు నెలల కాలంలోనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గురించి చెప్పనక్కర లేదని, ఆయన బాగోతం అందరికీ తెలిసిందేనని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించిందని గుర్తుచేశారు. నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఏమైందని ప్రశ్నించారు. ఈ సమావేశానికి స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అధ్యక్షత వహించారు.

మండలిలో ధిక్కార స్వరాలు రావాలి

- ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి
- పట్టభద్రులకు కేటీఆర్ పిలుపు

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు కావల్సింది అధికారస్వరాలు కాదు.. ధిక్కార స్వరాలు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలు అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. రాష్ట్ర శాసనమండలిలో పట్టభద్రుల సమస్యలపై బలమైన గొంతు వినిపించే ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని పట్టభద్రులను కోరారు. వరంగల్-నల్లగొండ-ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల స్థానానికి ఉప ఎన్నికల నేపథ్యంలో శనివారం ట్వీట్ చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి హనుమకొండ జిల్లాలోని మారుమూల గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించారని తెలిపారు. ప్రతిష్ఠాత్మక బిట్స్ పిలానిలో రాకేశ్‌రెడ్డి విద్యాభ్యాసం చేశారని, మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్‌లో డ్యుయల్ మాస్టర్స్ డిగ్రీ పొందిన ఉన్నత విద్యావంతుడని కొనియాడారు. అమెరికాలో పలు అంతర్జాతీయ కంపెనీల్లో రాకేశ్‌రెడ్డి ఉద్యోగం చేసి వచ్చారని తెలిపారు. సమకాలీన రాజకీయాలపై, ఆర్థిక స్థితిగతులపై ప్రముఖ పత్రికల్లో వ్యాసాలు రాయడమే కాకుండా నవశకానికి నాంది, ప్రగతి రథచక్రాలు, ఫిస్కల్ ఫెడరలిజం, దడాన్ ఆఫ్ న్యూఎరా, తెలంగాణ ఎకానమీ లాంటి పుస్తకాలను రచించారని పేర్కొన్నారు. సివిల్స్ కోచింగ్‌కు గెస్ట్ లెక్చర్లు ఇచ్చారని, ఈ-క్లాసెస్ యాప్ అనే ఫ్రీ కోచింగ్ యాప్ ద్వారా ఉచితంగా అందజేశారని వివరించారు.

నేడు భువనగిరి, ఆలేరులో కేటీఆర్ పర్యటన

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా కేటీఆర్ ఆదివారం భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు భువనగిరిలోని సాయి ఫంక్షన్ హాల్‌లో, మధ్యాహ్నం ఆలేరు నియోజకవర్గంలోని ఎమ్మడి నరసింహారెడ్డి గార్డెన్స్‌లో ఏర్పాటుచేసిన సమావేశాల్లో ప్రసంగించనున్నారు.

పౌరసరఫరాలశాఖలో వెయ్యి కోట్ల స్కాం

- వడ్లు, సన్నబియ్యం టెండర్లలో గోల్‌మాల్
- కుంభకోణంలో రేవంత్, ఉత్తమ్ పాత్ర
- టెండర్లపై సోమవారం సీఎస్‌కు ఫిర్యాదు
- ధాన్యం తరలింపుపై కొనుగోలు సంస్థకు మరింత సమయమిస్తే న్యాయపోరాటం
- బీఆర్ఎస్ నేతలు పెద్ది, రవీందర్‌సింగ్

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోళ్లు, సన్నబియ్యం టెండర్లలో రూ.1000 కోట్ల కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. బియ్యం, వడ్ల కొనుగోళ్లు, టెండర్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతివాటం ప్రదర్శిస్తున్నదని పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో పౌరసరఫరాల సంస్థ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్‌తో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ గ్లోబల్ టెండర్లలో ధాన్యాన్ని కొనుగోలు చేసిన సంస్థ 90 రోజులు పూర్తి అయినా డబ్బులు చెల్లించలేదని, ధాన్యాన్ని తీసుకువెళ్లలేదని తెలిపారు. అయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఆ సంస్థకు మరికొంత సమయం ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, అంగన్‌వాడీ సెంటర్లలో మధ్యాహ్న భోజనానికి అవసరమైన సన్నబియ్యాన్ని సరఫరా చేసేందుకు పౌరసరఫరాల సంస్థ టెండర్లు పిలిచిందని, బహిరంగ మార్కెట్లో కిలో సన్నబియయం రూ. 42-45 మధ్య లభ్యమవుతున్నా టెండర్లలో మాత్రం రూ. 57కు ఖరారు చేశారని పేర్కొన్నారు. ఏడాదికి 10 నెలలకు 2.20 లక్షల టన్నుల బియ్యం అవసరం అవుతాయని, ఈ లెక్కన కిలోకు రూ. 15 చొప్పున అదనంగా చెల్లిస్తే మొత్తం రూ.330 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారం ఆ శాఖ మంత్రికి, ముఖ్యమంత్రికి తెలియకుండా జరిగే అవకాశమే లేదని పేర్కొన్నారు. ఒక సంస్థ రూ. 57కు టెండరు దాఖలు చేస్తే, మరో మూడు సంస్థలు రూ. 56.90 చొప్పున వేశాయని, ఒక్క పైసా కూడా తేడా లేకుండా మూడు సంస్థలు టెండరు ఎలా దాఖలు చేశాయని అనుమానం వ్యక్తంచేశారు. పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతున్నదని ఆరోపించారు.

ధాన్యం టెండర్లలోనూ గోల్‌మాల్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లో రాష్ట్రంలోని 35 లక్షల టన్నుల వడ్లను విక్రయించేందుకు పిలిచిన గ్లోబల్ టెండర్లలోనూ అక్రమాలు జరిగాయని సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. ఇందులో సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ ప్రత్యక్ష ప్రమేయం ఉన్నదని పేర్కొన్నారు. రేవంత్ నుంచి రాహుల్‌కు వాటాలు వెళ్లాయని తెలిపారు. గ్లోబల్ టెండర్లలో ధాన్యాన్ని కొనుగోలు చేసిన సంస్థ ధాన్యం తరలించేందుకు మరింత సమయం ఇస్తే న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. రైస్ మిల్లర్లను బెదిరించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. టెండరులో క్వింటాలుకు రూ. 2007కు కోట్ చేశారని, కానీ గోదాముల్లో ఉన్న ధాన్యాన్ని తీసుకెళ్లకుండా మిల్లర్ల దగ్గరున్న ధాన్యంపై ఒత్తిడి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వారి దగ్గర ధాన్యం లేకుంటే క్వింటాలుకు రూ.2,230 చెల్లించాలని టెండరు దక్కించుకున్న సంస్థ డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. తమకు అదనపు ఖర్చు అయిందని చెప్తూ అదనంగా రూ. 223 వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇదే ధాన్యాన్ని తాము క్వింటాలను రూ. 2100 చొప్పున కొనుగోలు చేస్తామని రైస్ మిల్లర్లు లేఖలు ఇచ్చినా తిరస్కరించిన ప్రభుత్వం కొన్ని సంస్థలకు లాభం చేకూర్చేలా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

గ్లోబల్ టెండర్లలో రూ. 700 కోట్ల కుంభకోణం

సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్ మాట్లాడుతూ గ్లోబల్ టెండర్లలో రూ.700 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. పౌరసరఫరాలశాఖలో మొత్తంగా రూ. 1000 కోట్ల కుంభకోణం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ నేతల ఒత్తిడికి తలొగ్గకుండా అధికారులు నిబంధనల మేరకు వ్యవహరించాలని సూచించారు. ఈ టెండర్ల అక్రమాలపై సోమవారం బీఆర్ఎస్ పార్టీ తరపున సీఎస్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు. టెండర్ల ప్రక్రియను పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రహసనంగా మార్చారని విమర్శించారు. మొన్నటి ఎన్నికల్లో ఆర్ ఆర్ ట్యాక్స్ అన్నదానికి అర్థం ఈ టెండర్లే నని తెలిపారు. టెండర్లు గడువు పెంచితే తాము సీబీఐకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలుకు గ్లోబల్ టెండర్లు దక్కించుకున్న నాలుగు సంస్థలే సన్న బియ్యం సేకరణకూ టెండర్లు దక్కించుకోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నదని పేర్కొన్నారు.

...ఖజానాకు కన్నం!

మొదటిపేజీ తరువాయి...

ఆరోపిస్తుండగా.. మొత్తం కుంభకోణాన్ని త్వరలోనే బయటపెడతానని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వానికి కలుగుతున్న ఈ నష్టం.. ఎవరికి లాభం చేకూర్చుతున్నదో చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

42కు దొరికే బియ్యం.. 57కు కొనుగోలు

గురుకులాలు, అంగన్‌వాడీలు, మధ్యహ్న భోజన పథకానికి సన్నబియ్యం సరఫరా కోసం ఇటీవల పౌరసరఫరాల సంస్థ గ్లోబల్ టెండర్లను ఆహ్వానించింది. ఈ టెండర్లు ద్వారా 2.20 లక్షల టన్నుల సన్నబియ్యం సేకరించాలని నిర్ణయించింది. నాలుగు సంస్థలు టెండర్ దాఖలు చేసినట్టు తెలిసింది. సదరు సంస్థలు కిలో రూ.57 వరకు ధర కోడ్ చేసినట్టు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. బహిరంగ మార్కెట్లో ప్రస్తుతం సన్న బియ్యం రూ. 42-45 వరకు లభించే అవకాశం ఉంది (ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తుంది కాబట్టి తక్కువ ధరకు వస్తాయి). మిల్లర్లు కూడా ఇదే ధరకు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అయినప్పటికీ ఇటు బహిరంగ మార్కెట్ ధరను, మిల్లర్లను పక్కనపెట్టి కిలో రూ.57కు కొనుగోలుకు సిద్ధమవడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ లెక్కన కిలోకు సుమారు రూ.15 చొప్పున టన్నుకు రూ. 15వేలు అదనంగా చెల్లిస్తున్నారు. పౌరసరఫరాల సంస్థ 2.20 లక్షల టన్నులు సేకరించనున్న నేపథ్యంలో రూ.330 కోట్లు అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ 330 కోట్లు ఎవరి జేబులోకి వెళ్తున్నాయో చెప్పాలని డిమాండ్ చేస్తున్నాయి.

ధాన్యం ఎత్తని సంస్థలకు మళ్లీ టెండర్లు!

మూడు నెలల క్రితం పౌరసరఫరాల సంస్థ ధాన్యం విక్రయించేందుకు గ్లోబల్ టెండర్లను ఆహ్వానించింది. ఈ టెండర్లలో పాల్గొన్న కేంద్రీయ భండార్, హిందుస్థాన్ ఎంటర్‌ప్రైజెస్, నాఫ్‌తో పాటు మంచుకొండ ఆగ్రోటెక్ సంస్థలు ధాన్యం టెండర్లను దక్కించుకున్నాయి. కేంద్రీయ భండార్, హిందుస్థాన్ ఎంటర్‌ప్రైజెస్‌తోపాటు మరొక సంస్థ ఇప్పుడు సన్న బియ్యం టెండర్లను కూడా దక్కించుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. టెండర్లలో దక్కించుకున్న ధాన్యాన్ని నిబంధనల ప్రకారం 60 రోజుల్లో మిల్లుల నుంచి ఖాళీ చేయాలి. మరో వారం గడిస్తే ఆ గడువు పూర్తికానుంది. కానీ ఇప్పటికి కేవలం 20 శాతం ధాన్యాన్ని మాత్రమే ఆయా సంస్థలు ఖాళీ చేశాయి. అవి ధాన్యం ఎత్తితేనే ప్రభుత్వానికి డబ్బులు వస్తాయి. లేనిపక్షంలో వడ్లీ కూడా ప్రభుత్వం నష్టపోనుంది. ఇలాంటి కంపెనీలకే మళ్లీ సన్నబియ్యం టెండర్లు కట్టబెట్టడం ఏమిటని, దీని వెనుక మతలబు ఏమిటని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. అంటే సదరు సంస్థలు, అధికారులు, ప్రభుత్వ పెద్దలు కలిసి కుమ్మక్కయ్యారా అంటూ నిలదీస్తున్నాయి.

అగ్గువకే వడ్లు అమ్మేసి.. అధిక ధరకు బియ్యం కొనడమా.?

ఎవరైనా సన్న వడ్లను, సన్న బియ్యాన్ని దాచుకొని వాడుకుంటారు. వాటి విలువ అలాంటిది. పౌరసరఫరాల సంస్థకు మాత్రం సన్న వడ్ల విలువ తెలియడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దాచుకొని వాడుకోవాల్సిన సన్న వడ్లను అగ్గువ ధరకే అమ్మేసి.. ఇప్పుడు అధిక ధరకు సన్న బియ్యం కొనుగోలు చేస్తున్నది. సన్నబియ్యం టెండర్లపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో పౌరసరఫరాల సంస్థ చేసిన మరో నిర్వాకం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మూడు నెలల క్రితం పౌరసరఫరాల సంస్థ 35 లక్షల టన్నుల ధాన్యాన్ని విక్రయించింది. ఇందులో 1.59 లక్షల టన్నుల సన్న ధాన్యం కూడా ఉంది. ఈ ధాన్యాన్ని గన్నీ, మార్కెట్ ఫీజు కాకుండా కిలో రూ. 22.59 చొప్పున విక్రయించింది. ఈ ధాన్యాన్ని విక్రయించకుండా మిల్లర్లకు ఇచ్చి వారి నుంచి సన్న బియ్యం తీసుకోవచ్చు. తద్వారా సుమారు లక్ష టన్నుల సన్న బియ్యం వచ్చే అవకాశం ఉంది. ఈ లక్ష టన్నులు పోగా.. మిగిలిన అవసరాలకు టెండర్లు పిలిస్తే సరిపోయేది. కానీ పౌరసరఫరాల సంస్థ మాత్రం చేతిలో ఉన్న ధాన్యం అమ్ముకొని కొత్తగా సన్నబియ్యం కోసం టెండర్లు పిలవడంపై ప్రతిపక్షాలు నిప్పులు చెరుగుతున్నాయి. సన్న వడ్లను బియ్యంగా మార్చితే ప్రభుత్వానికి కిలోకి రూ. 37 వరకు మాత్రమే ఖర్చు అయ్యేది. కానీ కిలోకి రూ. 57 చొప్పున వెచ్చించి కొనుగోలు చేయడంతో కిలోకు రూ. 20 వరకు నష్టం వాటిల్లుతున్నది. ఈ లెక్కన లక్ష టన్నులకు రూ. 200 కోట్లు ప్రభుత్వం నష్టపోయిందనే వాదన వినిపిస్తున్నది. ఇది యాదృచ్ఛికంగా జరిగిందా లేక పక్కా ప్రణాళిక ప్రకారమే జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అంతా రహస్యం...!

సన్న బియ్యం టెండర్లను పౌరసరఫరాల సంస్థ అత్యంత రహస్యంగా నిర్వహిస్తున్నది. ఇందుకు సంబంధించి ఏ చిన్న విషయం కూడా బయటకు వెళ్లకుండా జాగ్రత్తపడుతున్నది. మొత్తం టెండర్ ప్రక్రియలో అధికారులను పూర్తిగా పక్కకు పెట్టినట్టు తెలిసింది. ప్రత్యేకమైన అధికారులతో ఈ వ్యవహారాన్ని నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం. ఈ టెండర్లకు సంబంధించి వ్యవహారం మొత్తం సచివాలయం నుంచి సాగిస్తున్నట్టు చెప్తున్నారు. దీనిపై సివిల్ సప్లై ఉద్యోగులు కూడా ఆందోళనలో ఉన్నట్టు తెలిసింది. ఇది ఎక్కడికి వెళ్లి ఎవరి మెడకు చుట్టుకుంటుందోననే భయం పట్టుకున్నట్టు చర్చ జరుగుతున్నది.

సన్న బియ్యం భారాన్ని తప్పించిన కేసీఆర్ ప్రభుత్వం

పేద విద్యార్థులకు కడుపునిండా భోజనం పెట్టాలని సంకల్పించిన నాటి సీఎం కేసీఆర్ గురుకులాల్లో, మధ్యాహ్న భోజనంలో, అంగన్‌వాడీలకు సన్న బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు. సన్న బియ్యం పంపిణీతో పౌరసరఫరాల సంస్థపై ఆర్థికంగా భారం పడకుండా నాటి అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసే దానిలో వచ్చే సన్న ధాన్యాన్ని సీఎంఆర్ కింద ఎఫ్‌సీఐకి ఇవ్వకుండా రాష్ట్ర కోటా కింద సన్న బియ్యం తీసుకునేది. ఆ బియ్యాన్ని గురుకులాలు, ఇతర సంస్థలకు సరఫరా చేసేది. ఒకవేళ సన్న ధాన్యం తక్కువగా వస్తే దొడ్డు ధాన్యాన్ని మిల్లర్లకు ఇచ్చి క్వింటాలుకు రూ.140 చొప్పున చెల్లించి సన్న ధాన్యం తీసుకునేది. ఈ లెక్కన కిలోకు రూ. 1.4 పైసలు ధర పడేది. ఈ విధంగా గత ప్రభుత్వం సన్న ధాన్యం కొనుగోలు పేరుతో ఏనాడూ సంస్థపై భారం పడకుండా జాగ్రత్తలు తీసుకున్నది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు కాకముందే సన్న బియ్యం కోసం టెండర్లు పిలిచి సంస్థపై ఆర్థిక భారాన్ని మోపుతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కార్పొరేట్ విద్యాసంస్థలను కట్టడి చేయండి:ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, మే18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కార్పొరేటు విద్యాసంస్థలను కట్టడి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేవలం ధనార్జనే ధ్యేయంగా యాజమాన్యాలు అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. వాటిపై విచారణ జరిపి, ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 40 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

'వీసీలుగా బీసీలకు అవకాశమివ్వాలి'

హైదరాబాద్, మే18 (నమస్తే తెలంగాణ): త్వరలో భర్తీ చేయనున్న 9 యూనివర్సిటీలకు సంబంధించి వీసీలుగా సగం మంది బీసీలకు అవకాశమివ్వాలని కోరు తూ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఒక లేఖను రాశారు. యూనివర్సిటీ పోస్టుల నియామకాల్లో సామాజిక న్యాయాన్ని పాటించాలని తెలిపారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్. చిత్రంలో బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, ఉమ, భూపతిరెడ్డి, గట్టు

రైతుబంధు జూన్‌లోనే ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి...

మాట్లాడుతూ.. రైతుబంధు ముఖ్య ఉద్దేశమే పంట సాగుకు ముందే అవసరమైన పెట్టుబడి సాయాన్ని అందించి, రైతులకు అండగా నిలబడటమని చెప్పారు. మే చివరి వారంలో రోహిణీ కార్తెలో తొలకరి జల్లులు వస్తాయని, అప్పటినుంచే పంట సాగు పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆ సమయంలో రైతులు పెట్టుబడి గురించి తీవ్ర ఆవేదన, ఆందోళనతో ఉంటారని, పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యాపారులు, వడ్డీ వ్యాపారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతారని తెలిపారు. ప్రభుత్వ సాయం సరియైన సమయంలో అందితేనే వారికి ఉపశమనం లభిస్తుందని చెప్పారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలు, ఇతర వ్యవసాయ పనుల కోసం రైతులు ఆ డబ్బును వాడుకుంటారని వివరించారు. ఈసారి వర్షాలు ముందే కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో క్యాబినెట్ భేటీలో రైతుబంధుపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను అమలు చేస్తుందా? రైతుబంధును అమలు చేస్తుందా? అని ప్రశ్నించారు. రైతులు పండించిన పంటలకు ఇస్తామన్న బోనస్ పథకాన్ని బోగస్ పథకంగా మార్చొద్దని హితవు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లకే బోనస్‌గా రూ.500 ఇస్తామనడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలింగ్‌కు రెండు రోజుల ముందు ఈ మాట అని ఉంటే, కాంగ్రెస్‌కు అన్ని స్థానాల్లో కనీసం డిపాజిట్లు కూడా దక్కేవి కావని చెప్పారు. తెలంగాణలో ఉన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వానకాలంలోనే ఎక్కువ సన్న వడ్లు పండుతాయని, వానకాలంలోనూ 40% రైతులు మాత్రమే సన్న వడ్లు పండిస్తారని తెలిపారు. దీంతో మెజార్టీ రైతులకు రూ.500 బోనస్ పొందే అవకాశం ఉండదని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యం రైతుల దగ్గర ఎంత ఉన్నా ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. ప్రభుత్వ పనితీరును ప్రజలు బేరీజు వేయడానికి, గ్రేడింగ్ ఇవ్వడానికి మొదటి ఆరు నెలలు చాలా కీలకమని, రేవంత్‌రెడ్డి ఈ ఆరు నెలల్లో తన ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాం అని చెప్పుకోవడానికి ఏ ఒక్క పథకం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకొని, ఇచ్చిన హామీలను, ప్రజా సమస్యలను పరిష్కరించాలని హితవు చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎం శ్రీనివాస్‌రెడ్డి, తుల ఉమ, భూపతిరెడ్డి, గట్టు రాంచందర్‌రావు పాల్గొన్నారు.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ & అప్లైడ్ న్యూట్రిషన్
(పర్యాటక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం పరిధిలోని స్వయం ప్రతిపత్తిగల సంస్థ)
"F" Row, డి.డి. కాలనీ, విద్యానగర్, హైదరాబాద్. ఫోన్: 040-27427569
మొబైల్: 8374787988. ఇ-మెయిల్: ihmhyd.principal@gmail.com, వెబ్‌సైట్: www.ihmhyd.org

2024-25 కాలానికి దిగువ జాబ్ ఓరియంటెడ్ కోర్సుల కొరకు అడ్మిషన్లు జరుగుచున్నవి

ఎస్.ఎస్.సి/X తరగతి పాసైన అభ్యర్థుల కొరకు:

ఫుడ్ ప్రొడక్షన్ & పటీసరీ (కిచెన్ & బేకరీ)లో క్రాఫ్ట్ స్మన్ షిప్ కోర్సు
కాల వ్యవధి: ఒకటిన్నర సంవత్సరం - రెండు సెమిస్టర్లు

ఫుడ్ & బేవరేజ్ సర్వీస్ (రెస్టారెంట్)లో క్రాఫ్ట్ స్మన్ షిప్ కోర్సు
కాల వ్యవధి: 24 వారాలు ఫుల్ టైమ్

అడ్మిషన్ అర్హతా ప్రమాణం: రెండు కోర్సుల కొరకు: పాఠశాల తుది పరీక్షలో ఒక సబ్జెక్టుగా ఇంగ్లీష్‌తో 10+2 విధానం లేదా తత్సమాన విధానంలో ఎస్.ఎస్.సి/10వ తరగతి. (ఎస్.ఎస్.సి పరీక్షలకు హాజరవుతున్నటువంటి అభ్యర్థులు కూడా దరఖాస్తు ఫారాన్ని దాఖలు చేయవచ్చు).

ప్రొఫెషనల్ బార్‌టెండింగ్ (రెస్టారెంట్)లో సర్టిఫికెట్ కోర్సు
కాల వ్యవధి: 06 నెలలు

అడ్మిషన్ అర్హతా ప్రమాణం: సీనియర్ సెకండరీ (10+2) లేదా తత్సమానం

గరిష్ట వయోపరిమితి : లేదు

దరఖాస్తు చేయు విధానం: హైదరాబాద్ వద్ద చెల్లింపయ్యేలా, Principal, Institute of Hotel Management పేరున తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో జనరల్ కొరకు రూ. 500/- మరియు ఎస్సీ/ఎస్టీ విద్యార్థుల కొరకు రూ. 300/- రిజిస్ట్రేషన్ ఫీజుతో కలిపి www.ihmhyd.org నుండి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తు ఫారాన్ని తగువిధంగా పూర్తిచేయాలి.

అడ్మిషన్ జరుగుతున్నది మరియు అది ఫస్ట్ కమ్-ఫస్ట్ సర్వ్ ప్రాతిపదికపై కేటాయించబడును. ప్రతీ కోర్సుకి విడిగా దరఖాస్తు ఫారం దాఖలు చేయాల్సి ఉంటుంది. 2024-25 విద్యా సంవత్సరానికిగాను ప్రకటించిన కోర్సులు వాయిదావేయు లేదా రద్దుచేయు హక్కు ఇన్‌స్టిట్యూట్‌కు కలదు.

సం/- ప్రిన్సిపాల్/మెంబర్ సెక్రటరీ